క్లుప్తంగా

ఇంటి పనుల్లో వేగం పెంచండి



మాట్లాడుతున్న కమిషనర్ నర్సింహ

సత్తుపల్లి: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్ కె.నర్సింహ స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంజూరు పత్రాలు అందుకొని ఇంటి పనులు చేపట్టని లబ్ధిదారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. త్వరితగతిని పనులు చేపట్టకపోతే మంజూరు పత్రాలు రద్దయ్యే అవకాశం ఉందన్నారు. సమావేశంలో మేనేజర్ మైసా శ్రీనివాస్, మెప్మా ప్రసాద్ పాల్గొన్నారు.

సత్తుపల్లి డిపో ఉద్యోగులకు అవార్డులు



ఈడీ, ఆర్ఎంతో డిపోమేనేజర్, ఉద్యోగులు

సత్తుపల్లిటౌన్: ఆర్టీసీలో ప్రగతి రథ చక్ర అవార్డులు ఇటీవల అందజేయగా సత్తుపల్లి డిపో ఉద్యోగులు పలువురు ఎంపికయ్యారు. సత్తుపల్లి డిపో నుండి జి.బాలరాజు(కండక్టర్), జి.విజయరాణి(కండక్టర్), కె.ఉపేందర్(టిమ్స్ డ్రైవర్), కె.ఎం.కృష్ణ(డ్రైవర్) జాబితాలో ఉండగా, వీరికి ఖమ్మంలో కరీంనగర్ జోన్ ఈడీ సోలోమన్, ఖమ్మం రీజినల్ మేనేజర్ ఏ.సరిరామ్ అవార్డులు అందించారు. వీరిని సత్తుపల్లి డీఎం ఊటుకూరి సునీత, ఉద్యోగులు అభినందించారు.

22న ఇసుక వేలం పాట

తల్లాడ: ఇటీవల లారీలో అక్రమంగా తరలిస్తుండగా సీజ్ చేసిన ఇసుకను 22వ తేదీన వేలం వేయనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. ఇసుక క్యూబిక్ మీటర్ రూ.642 చొప్పున వేలం పాట ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు రూ.వేయి ధరావత్తు చెల్లించి పాల్గొనాలని సూచించారు.

ఇసుక అక్రమ రవాణా చేయొద్దు..

ముదిగొండ: అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ మురళి హెచ్చరించారు. పెద్ద మండవ, గందసిరి గ్రామాల్లోని మున్నేరులోకి అక్రమంగా ఇసుక ట్రాక్టర్లు వెళ్లకుండా మున్నేరు సమీపంలోని రహదారులపై జేసీబీలతో శుక్రవారం కందకాలు తవ్వించామని, ఆయా గ్రామాల వద్ద నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. అక్రమ రవాణా చేస్తే గ్రామస్తులు సమాచారం అందించాలన్నారు.


ఉచిత కంటి వైద్య శిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెంలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఎల్వీ ప్రసాద్ ఇన్‌స్టిట్యూట్, నవభారత్ ఐ సెంటర్ సహకారంతో నిర్వహించిన వైద్య శిబిరంలో 150మందికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలు అందించారు. ఈ వైద్య శిబిరంలో అడ్మినిస్ట్రేటర్ శ్రీదేవిచందర్‌రావు, విజన్‌సెంటర్ కోఆర్డినేటర్ సాయితేజ, విజన్ టెక్నీషియన్ వినోద, స్నేహ చైతన్య విజయలక్ష్మి, జ్యోతి సారిక తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల క్షేత్ర సందర్శన



క్షేత్ర సందర్శనలో అశోక్‌చక్రం వద్ద విద్యార్థులు, ఉపాధ్యాయులు

సత్తుపల్లిరూరల్: పట్టణంలోని మిరాకిల్‌మైండ్స్ పాఠశాల యుకేజీ విద్యార్థులు శుక్రవారం క్షేత్ర సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్, ఫైర్ స్టేషన్లను, పోస్టాఫీస్, మున్సిపల్ కార్యాలయాలతో పాటుగా.. అశోకచక్రం, రాజముద్ర, మహాత్ముని విగ్రహాలను సందర్శించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రత్నాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సిగ్నల్స్ వచ్చేశాయ్..



నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నళ్లు

- వాహనదారులకు తీరనున్న ట్రాఫిక్ కష్టాలు
- నూతన టెక్నాలజీతో ఏర్పాటు
- రూ.12లక్షల వ్యయంతో పనులు
- మరో వారంలో అందుబాటులోకి..

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లికి ఆధునిక టెక్నాలజీతో ట్రాఫిక్ సిగ్నళ్లు అందుబాటులోకి రానున్నాయి. పట్టణంలోని రింగ్ సెంటర్, పాత సెంటర్ కాకర్లపల్లిరోడ్ కూడళ్ల వాహనాల రాకపోకల రద్దీతో నిత్యం ట్రాఫిక్ పద్మ వ్యూహాన్ని తలపిస్తోంది. కూడలి ప్రాంతాల్లో వ్యాపారాలు విస్తరించటం.. పలువురు యథేచ్ఛగా పార్కింగ్ చేస్తుండటం.. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడపటం వంటి చర్యలతో తరచూ ట్రాఫిక్‌జామ్ అవుతుంది.

వారంలో అందుబాటులోకి..



సత్తుపల్లి పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరించేందుకు రూ.12 లక్షల వ్యయంతో చేపట్టిన ఆధునిక సిగ్నల్‌లైట్లు వారం రోజుల్లో అందుబాటులోకి వచ్చేలా చర్యలు చేపట్టాం. రింగ్ సెంటర్‌లో పచ్చదనం ఫరిడవిల్లేలా మొక్కలు పెంచుతాం. డివైడర్లను పునఃనిర్మాణం చేశాం. – కె.నర్సింహ, మున్సిపల్ కమిషనర్, సత్తుపల్లి

దీంతో వాహనదారులు నానా అవస్థలు పడడంతోపాటు ప్రమాదాలకు గురవుతున్నారు. దీంతో నియోజకవర్గ ప్రధాన కేంద్రమైన సత్తుపల్లి పట్టణంలో వాహనాల రద్దీ పెరుగుతుండటంతో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం సంకల్పించింది.

చకచకా సిగ్నళ్ల పనులు..

రింగ్ సెంటర్ ఇరుకుగా ఉండటంతో వేంసూరు రోడ్డు నుంచి అయ్యగారిపేట వెళ్లేందుకు మధ్యలో ఉన్న సెంటర్ డివైడర్‌ను కుదించారు. అదే విధంగా కళాభారతి – వేంసూరు సెంటర్ డివైడర్‌ను కుదించారు. దీంతో రింగ్ సెంటర్ విశాలంగా మారటంతో వాహనాలు సైతం మలుపులు తిరిగేందుకు అనుకూలంగా ఉంది.

కొత్త టెక్నాలజీతో..

రింగ్‌సెంటర్‌లోని ఫోర్‌వే ట్రాఫిక్ సిగ్నళ్లు, కాకర్లపల్లి రోడ్ వద్ద త్రీవే ట్రాఫిక్ సిగ్నళ్లు ఏర్పాటు చేశారు. వీటిని ఆధునిక టెక్నాలజీ న్యూక్లియానిక్స్ సహాయంతో సిగ్నల్‌లైట్లు పని చేసేలా చర్యలు చేపట్టారు. రింగ్‌సెంటర్ వద్ద ఆటో కంట్రోలింగ్ యూనిట్‌బాక్స్‌ను ఏర్పాటు చేసి అందులోని సాఫ్ట్‌వేర్‌తో సిగ్నల్ లైట్లు సమయాలను ఫీడ్ చేశారు. రూ.12 లక్షల వ్యయంతో ఈ పనులు చేపట్టారు.



సిగ్నళ్లు లేక పద్మవ్యూహాన్ని తలపిస్తున్న రింగ్‌సెంటర్

మార్కెట్‌ను అభివృద్ధి పథంలో నడిపించాలి



ఏఎంసీ చైర్మన్ లచ్చిరామ్ నాయక్, డైరెక్టర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

ఏన్కూరు: ఏన్కూరు మార్కెట్‌ను అభివృద్ధి పథంలో నడిపించడానికి నూతన పాలక మండలి కృషి చేయాలని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. శుక్రవారం ఏన్కూరు మార్కెట్ కమిటీ కార్యాలయంలో నూతన చైర్మన్‌గా గుగులోత్ లచ్చిరామ్‌నాయక్, పాలక మండలి డైరెక్టర్లతో ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం చేయించి, వారిని శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల బాధ చూడలేని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. రూ.20వేల కోట్లు పంట రుణమాఫీ చేసిందన్నారు. ఏన్కూరు మార్కెట్ కమిటీ పరిధిలోని రైతులకు సరైన మద్దతు ధర వచ్చేలా కృషి చేసి... మార్కెట్‌కు మరింత ఆదాయం వచ్చేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైరా ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ, ఏఓ నరసింహారావు, సొసైటీ చైర్మన్ వెంకటేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

క్రీడలు దేహదారుఢ్యాన్ని పెంపొందిస్తాయి



క్రీడా పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఈఓ రాజేశ్వరరావు, తదితరులు

సత్తుపల్లిరూరల్: క్రీడలు దేహదారుఢ్యాన్ని పెంపొందిస్తాయని ఎంఈఓ నక్కా రాజేశ్వరరావు అన్నారు. శుక్రవారం గంగారం ఎస్‌డీబీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఆటల పోటీలను ప్రారంభించారు. హెచ్ఎం జయరాజు, దాసరి వెంకట్రామిరెడ్డి(చిట్టినాయన), పీడీలు శేఖర్, శ్రీదేవి, పద్మావతి, రజిని, వెంకటేశ్వరరావు, మాలిని, పద్మ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

- ముదిగొండ: మండలంలోని వెంకటాపురం సేయింట్ ఆన్స్ స్కూల్‌లో నిర్వహించిన క్రీడలను ఎంఈఓ రమణయ్య, టోర్నమెంట్ కన్వీనర్ వెంకట్రామిరెడ్డి శుక్రవారం ప్రారంభించి, ద్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శంకరయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శంకుస్థాపన



పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మార్కెట్ చైర్మన్ వెంకటేశ్వర్లు

చింతకాని: మండలంలోని నాగులవంచ రైల్వేకాలనీలో గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణానికి మత్కేపల్లి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ అంబటి వెంకటేశ్వర్లు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ.. డిప్యూటీ సీఎం భట్టి సిఫారసు మేరకు రూ.20లక్షలు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ మండల ఏఈ రఘు, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఉపేందర్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యులు రాములు నాయక్, పృథ్వీరాజ్

మధిర: మధిర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు శుక్రవారం సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దెందుకూరు పీహెచ్‌సీ వైద్యులు రాములు నాయక్, పృథ్వీరాజ్ మాట్లాడుతూ.. గుండెపోటు వచ్చిన వారికి వెంటనే సీపీఆర్ చేసి బతికించవచ్చన్నారు. టెలీ మానస్ హెల్ప్ లైన్ నెంబర్ 14416 ద్వారా మరెన్నో విషయాలను తెలుసుకోవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జైదాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి తౌరియా, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతాంగాన్ని ఆదుకోవాలి



పత్తి పంటను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

కల్లూరురూరల్: ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం నాయకులు తెలిపారు. సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం కల్లూరు మండలంలోని పెద్దకోరుకొండి, చెన్నూరు గ్రామాల్లో పంటపొలాలను పరిశీలించారు. అధిక వర్షాలతో వరి, మిర్చి, మొక్కజొన్న, పెసర పంటలు దెబ్బతినగా, పత్తిచేలు ఎర్రబారిందన్నారు. రైతాంగ సమస్యల పరిష్కారానికై ఈ నెల 22, 23, 24వ తేదీల్లో జిల్లాలోని తహసీల్ ఎదుట ధర్నాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మాదిరి రమేష్, డివిజన్ కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, మండల కార్యదర్శి వెంకటేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలి



దయానంద్‌ను కలిసిన కల్లూరు రైతులు

కల్లూరు: కల్లూరు అయ్యప్పస్వామి గుడి ప్రాంగణంలో కల్లూరు రైతులకు నూతన ఐకేపీ సెంటర్‌ను కేటాయించి గ్రామ సమాఖ్యల ద్వారా ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కోరారు. ఈ మేరకు రైతులు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మట్టా దయానంద్‌కు వినతి అందించగా.. ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో కాశ్మీర్ మహాదేవ క్షేత్రం ఆలయ కమిటీ మెంబర్ ఎనుముల రాము యాదవ్, కల్లూరు సొసైటీ మాజీ డైరెక్టర్ రవీంద్ర, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొణిజర్ల: మండలంలోని తనికెళ్లలో గల 33–11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 9గంటల నుంచి 11:30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ రాయల రాజేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో వినియోగదారులు సహకరించాలన్నారు.

- తల్లాడ: కుర్నవల్లి సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిర్వహిస్తున్నందున శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏఈ కృష్ణకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు.
- చింతకాని: నాగులవంచ విద్యుత్ సబ్‌స్టేషన్ నందు మరమ్మతు పనులతో శనివారం నాగులవంచ, సీతంపేట, తిమ్మినేనిపాలెం, పాతర్లపాడు ఫీడర్లకు ఉదయం 9.30 గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సబ్‌స్టేషన్ ఏఈ ఉమామహేశ్వరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యుత్ స్తంభాలు ఏర్పాటు



విద్యుత్ స్తంభాల ఏర్పాటును పరిశీలిస్తున్న మధుమోహన్‌రెడ్డి

సత్తుపల్లిరూరల్: మండలంలోని గంగారంలో విద్యుత్ స్తంభాలు విరిగి, వైర్లు వెలాడుతూ ప్రమాదకరంగా మారడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రజలు విషయాన్ని గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు దాసరి మధుమోహన్‌రెడ్డి దృష్టికి తీసుకురాగా.. తన సొంత ఖర్చులతో శుక్రవారం బాగు చేయించారు.

మొక్కలు నాటాలి



మొక్క నాటుతున్న శేషారెడ్డి, ఉపాధ్యాయులు

కొణిజర్ల: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఇండోఫిల్ కంపెనీ రీజనల్ మేనేజర్ శేషారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని సిద్దిక్‌నగర్ ఆంజనేయ స్వామి దేవాలయం సమీపంలో, పల్లిపాడు కార్తీక్ విద్యాలయం ఆవరణలో తమ కంపెనీ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఖమ్మం టెరిట్రీ మేనేజర్ రాఘవ, కార్తీక్ విద్యాలయం కరస్పాండెంట్ మాధవరెడ్డి, ఇండోఫిల్ శ్రీనివాసరెడ్డి, సిద్దిక్‌నగర్ పంచాయతీ కార్యదర్శి రమణ పాల్గొన్నారు.

విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

కొణిజర్ల: విద్యార్థులు ఎప్పటికప్పుడు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని శ్రీకవిత విద్యా సంస్థల చైర్మన్ పారుపల్లి ఉషాకిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని తనికెళ్ల సమీపంలో గల విజయ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించగా.. జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కళాశాల వైస్ చైర్మన్ పారుపల్లి విజయలక్ష్మి, ప్రిన్సిపల్ చిన్నయ్య, వైస్ ప్రిన్సిపల్ ఆయేషా తరుణమ్, డీన్ శ్రీనివాస్, ఏఓ ఫరీద్ బాబా, వివిధ విభాగాల హెచ్ఓడీలు పాల్గొన్నారు.

విద్యావంతులుగా తీర్చిదిద్దండి



ప్రభుత్వ కళాశాలలకు కంప్యూటర్లు అందిస్తున్న ఎమ్మెల్యే రాగమయి, దయానంద్

సత్తుపల్లిటౌన్: ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనని ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. సత్తుపల్లి మున్సిపల్ నిధులు రూ.6 లక్షలతో తీసుకున్న పది కంప్యూటర్లను.. శుక్రవారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో సత్తుపల్లి ప్రభుత్వ బాలికల, బాలుర జూనియర్ కళాశాలలకు ఆమె అందించి మాట్లాడారు. విద్యార్థులు సాంకేతిక నైపుణ్యం పెంపొందించుకోవడానికి ఇవి ఉపయోగపడతాయన్నారు. అత్తగారు డాక్టర్ మట్టా ఆరోగ్యమ్మ స్ఫూర్తితో విద్యార్థుల ఉన్నతికి కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాల్స్ బి.భాగ్యలక్ష్మి, జి.లక్ష్మయ్య, మున్సిపల్ కమిషనర్ కె.నర్సింహ, తోట సుజలరాణి, ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్‌బాబు, చెన్నారావు, నర్సింహారావు, సామేలు, కమల్‌పాషా, రాంబాబు, లక్ష్మయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు కొనొద్దు..



వైరారూరల్: రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ మయాన్ మంజుఖాన్

కొణిజర్ల: రైతులు తొందరపడి ఏజెంట్ల వద్ద నకిలీ విత్తనాలను కొనవద్దని ఏఓ డి.బాలాజీ అన్నారు. శుక్రవారం మండలంలోని చిన్నమునగాలలో మొక్కజొన్న రైతులతో మాట్లాడుతూ.. విత్తనాలు కొనేసమయంలో కంపెనీ వివరాలు తెలుసుకుని అగ్రిమెంట్ చేయించుకోవాలన్నారు. నీటితడులకు అవకాశమున్న మెరక, నల్లరేగడి భూముల్లో మాత్రమే మొక్కజొన్న సాగుచేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ సరిత, రైతులు పాల్గొన్నారు.

ఖానాపురం గ్రామంలో..

వైరారూరల్: మండలంలోని ఖానాపురం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఏఓ మయాన్ మంజుఖాన్ మాట్లాడారు. కిసాన్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకున్న రైతులు మాత్రమే సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో మొక్కజొన్న విక్రయించుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు సపావత్ సైదులు, మేడా రాజేష్, రైతులు సీహెచ్ నాగమల్లేశ్వరరావు, ఎస్. శ్రీనివాసరెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలపై 23న ధర్నా

వైరా: మక్క రైతుల సమస్యలపై ఈ నెల 23న వైరాలో నిర్వహించే సదస్సును రైతులు జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, రాష్ట్ర నాయకుడు చలపతిరావు తెలిపారు. శుక్రవారం వైరాలో నిర్వహించిన రైతు సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. వైరా పరిసర మండలాల్లో సీడ్ మొక్కజొన్నలు వేయిస్తున్న విత్తనోత్పత్తి కంపెనీలు రైతులకు అగ్రిమెంట్లు ఇచ్చి కూలీల ఖర్చు కూడా భరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రామారావు, సాంబశివరావు, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

న్యాయమూర్తిపై దాడిని ఖండించాలి



చింతకాని: తహసీల్ ఎదుట ధర్నా చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మధిర/ చింతకాని/ ఎర్రుపాలెం/ ముదిగొండ: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వగిడిపల్లి రవీందర్, మండల అధ్యక్షుడు చిర్ర ఉపేందర్, మండల కమిటీ అధ్యక్షుడు చింతిరాల సురేష్ మాదిగ తెలిపారు. శుక్రవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మధిర, చింతకాని, ఎర్రుపాలెం, ముదిగొండ మండల కేంద్రంలోని తహసీల్ ఎదుట ధర్నా నిర్వహించగా.. సీపీఎం, బీఆర్ఎస్ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలో అత్యున్నతమైన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపైనే దాడికి పాల్పడటం ప్రజాస్వామ్యానికే మచ్చ అన్నారు. కార్యక్రమంలో రవి, వర్మ, సంజీవరావు, రవీందర్ బాబు, వెంకటేశ్వర్లు, రవీంద్ర, సీపీఎం మండల కార్యదర్శి ప్రభాకర్, ఎమ్మెస్పీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు నాయకులు తదితరులున్నారు.

మొక్కల రక్షణకు చర్యలు



మొక్క చుట్టూ కంచె ఏర్పాటు చేస్తున్న సిబ్బంది, పరిశీలిస్తున్న అధికారులు

కల్లూరురూరల్: గ్రామ పంచాయతీలో వేసిన మొక్కలకు రక్షణ చర్యలు చేపట్టేందుకు పంచాయతీరాజ్ శాఖ అధికారులు విస్తృతంగా కార్యక్రమాలు చేపట్టారు. శుక్రవారం మండలంలోని మండలంలోని నారాయణపురం, ముగ్గు వెంకటాపురం, గోకరవరం గ్రామ పంచాయతీల్లో సిబ్బంది రోడ్లకు ఇరువైపుల వేసిన మొక్కలకు పాదులు చేయడం, ట్యాంకర్లతో నీళ్లు పోయటం, రక్షణ కంచె ఏర్పాటు చేయడం పనులు చేశారు. ఈ పనులను కల్లూరు ఎంపీడీఓ చంద్రశేఖర్, ఈజీఎస్ ఏఈ పుల్లారావు, పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అమలుపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని శుక్రవారం మండల కేంద్రాల్లో సీపీఎం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. బీజేపీ తీరుతోనే బీసీలకు అన్యాయం జరుగుతుందని, రిజర్వేషన్ బిల్లుపై కేంద్ర ప్రభుత్వంపై పోరాడతామని, బీజేపీ తీరును నిరసిస్తూ ఈ నెల 18న చేపట్టే బంద్‌కు సీపీఎం సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



వైరాలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు



మధిర: వైఎస్సార్ చౌరస్తా వద్ద..



తల్లాడ: అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

నేటి బీసీ బంద్‌కు సహకరించండి

వైరా/ సత్తుపల్లిరూరల్: జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యాన అన్ని రాజకీయ పార్టీలు, కుల, ప్రజాసంఘాల మద్దతుతో శనివారం జరగనున్న బంద్‌కు అన్నివర్గాల ప్రజలు సహకరించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు, బీసీ జేఏసీ కన్వీనర్ మోదేపల్లి కృష్ణమాచారి, జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం వైరాలో వైరా నియోజకవర్గ బీసీ జేఏసీ సమావేశం నిర్వహించగా.. సత్తుపల్లిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రం తక్షణమే పార్లమెంట్‌లో తీర్మానం చేసి జీఓ నంబర్ 9ని అమలు చేయాలన్నారు. నాయకులు కృష్ణయ్య, యుగంధర్, శ్రీనివాస్, రామారావు, చెన్నారావు, రఫీ, ఆదినారాయణ, పాండు, సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.